COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 17 జూలై, 2023.

**రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలతో బిజెపి రాజకీయ క్రీడ**

**టిడిపి, వైసిపిలు ప్రాంతీయ పార్టీల ప్రధాన లక్షణాన్ని కోల్పోయాయి**

**బిజెపి గూటి చిలకలా జనసేన**

**- ఎన్‌టిఆర్ జిల్లా కార్యకర్తల సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**

రాష్ట్రంలో రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలన్నీ అవకాశం వాదంతో బిజెపితో అంటకాగుతున్నాయని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జనసేన ఎన్‌డిఎ సమావేశానికి హాజరు కావడం ఆ పార్టీ ఉనికికే దెబ్బ తీస్తుందని హెచ్చరించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఉపాంగంగా జనసేన మారిపోతుందని అన్నారు. రాష్ట్రంలో బిజెపి బలమైన శక్తిగా లేకపోయినా వైసిపి, టిడిపి, జనసేనల సాయంతో పార్టీ ఏదైనా 'మీరు గెలిపించండి.. మాతో పంపండి' అనే విధానంతోనే పనిచేస్తున్నదని విమర్శించారు. ఎన్‌టిఆర్ జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా మేధావులు గళం విప్పాలని విజ్ఞప్తి చేశారు.

అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి వారితోపాటు జనసేన బిజెపి ఎత్తుగడలకు లోబడే పని చేస్తున్నాయని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నికల వరకు మీతో పొత్తు పెట్టుకోము, కానీ ఆ తరువాత మీకు మద్దతిస్తాము అన్నట్లుగా ప్రచారం జరుగుతున్నదని, అయినా చంద్రబాబు ఖండించలేదని చెప్పారు. ఎన్‌టిఆర్ స్థాపించిన 80ల నాటి తెలుగు దేశం పార్టీ విధానాలకు, ఇప్పటి విధానాలకు అస్సలు పొంతన లేదని అన్నారు. ఇక అధికార వైసిపి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాన్ని అప్పజెప్పేసిందని విమర్శించారు. విద్యుత్ సవరణ చట్టం, ఉమ్మడి పౌరస్మృతిపై మద్దతు ఇవ్వడంతోపాటు పార్లమెంటులో జరుగుతున్న ప్రతి చర్చల్లోను వైసిపి, టిడిపి ఎంపిలు బిజెపిని బలపర్చారని, రాష్ట్రపతికి అవమానం జరిగిందని రాజకీయ పార్టీలన్నీ పార్లమెంటు నూతన భవనం ప్రారంభానికి వెళ్లబోమని తీర్మానిస్తే ఈ రెండు పార్టీలు మాత్రమే ఆ కార్యక్రమానికి హాజరయ్యాయని ఎద్దేవా చేశారు. పోలవరం నిర్వాసితులు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటాల్లో ఈ పార్టీలు కేంద్రంతో రాజీ పడుతున్నాయని, తమ రాజకీయ స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టారని విమర్శించారు.

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మాకు రోడ్‌మ్యాప్ బిజెపి ఇస్తుందని నేరుగా ప్రకటించారు. ఢిల్లీలో ఆ పార్టీ కేంద్ర నాయకులతో భేటీ అయిన వచ్చాక వారిలాగే టిడిపి పొత్తుపై 'అధ్యయనం' చేస్తున్నామని బిజెపి గూటి చిలకలా మాట్లాడారని అన్నారు. జనసేన బిజెపితో అంటకాగుతూ ముస్లింలు, క్రైస్తవులకోసం ఏం చేస్తుందని విమర్శించారు. హిందూధర్మాన్ని కాపాడడం కోసం పోరాడుతామని బహిరంగ సభలలో వ్యాఖ్యలు చేస్తున్నారని, రానున్న కాలంలో జనసేన ఆరెస్సెస్ అనుబంధ సంఘంగా మారిపోయినా ఆశ్చర్య పోనక్కరలేదని అన్నారు.

బిజెపి వంటి నిరంకుశ పార్టీల విధానాల వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడడమే ప్రాంతీయ పార్టీల ప్రధాన లక్షణమని, అవకాశవాదంతో ఆ లక్షణాన్నే మన రాష్ట్రంలోని పార్టీలు కోల్పోయాయని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో బిజెపికి మద్దతు ఇచ్చిన ప్రాంతీయ పార్టీలన్నీ చీలిపోవడం, నాశనమైపోవడమే జరిగిందని, మన రాష్ట్రంలో కూడా అదే పరిస్థితి దాపురిస్తుందని హెచ్చరించారు. బిజెపితో పోరాడిన పార్టీలే నిలబడగలుగుతున్నాయని అన్నారు. జూలై 17, 18 తేదీలలో బెంగుళూరులో జరిగే ప్రతిపక్ష పార్టీల సమావేశం దేశ రాజకీయాలను బిజెపికి వ్యతిరేకంగా తిప్పేందుకేనని అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడడం కోసం ఈ మూడు పార్టీలు బిజెపితో పొత్తులు విడనాడాలని కోరారు.

Jayaram

(జె.జయరాం)
ఆఫీసు కార్యదర్శి